## క్లుప్తంగా

### నిరుపేదలకు అండగా కాంగ్రెస్



ఎల్‌ఓసీని అందజేస్తున్న మండల నాయకులు

కుల్కచర్ల: నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పీఏసీఎస్ చైర్ చైర్మన్ నాగరాజు యాదవ్, చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన పల్నాటి పెంటయ్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.2.25 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సలీం, బుచ్చయ్య, యాదయ్య, రాజు, కృష్ణయ్య, చిన్నయ్య, బుచ్చయ్య, యాదయ్య పాల్గొన్నారు.

### వీరభద్రేశ్వరుడికి లక్ష బిల్వార్చన



పత్రితో పూజలు చేస్తున్న మహిళలు

ధారూరు: ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఉదయం కపిలేశ్వరస్వామికి రుద్రాభిషేకం, గణనాథుడు, కుమారస్వామి, నందీశ్వరుడు, వీరభద్ర స్వామి, పార్వతీమాతను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు జరిపారు. శివలింగానికి మారేడు దళాలను పెట్టి పూజలు చేశారు. అనంతరం పార్వతీమాత, కపిలేశ్వరస్వామికి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా పార్వతీమాత భక్తులకు శాకాంబరీ అవతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం పల్లకీలో స్వామివారిని గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

### వృథాగా పోతున్న నీరు



లీకేజీ అవుతున్న తూమును చూపిస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: మండలంలోని ఆలేడ్ గ్రామ చెరువు తూము నుంచి నీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చెరువు అలుగు పారడంతో చూసేందుకు వచ్చిన గ్రామస్తులు తూము నుంచి నీరు దిగువకు వృథాగా పోవడాన్ని గమనించారు. నిండిన చెరువు నుంచి నీరు వృథాగా పోతే చెరువు కింద ఉన్న పొలాల్లో పంటలు ఎలా పండించుకోవాలని వాపోతున్నారు. తూము శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేయించడని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తూము నుంచి నీరుపోకుండా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### సమయపాలన ముఖ్యం



మాట్లాడుతున్న శివకుమార్

అనంతగిరి: మనిషికి నిజాయితీ, సమయపాలన ముఖ్యమని ప్రముఖ వక్త కోట శివకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్‌లోని సత్యసాయి జ్ఞానకేంద్రం 22వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలు భువిపై వెల్లి విరియాలని కోరారు. మనిషికి విశ్వాసం, వినయం, క్రమశిక్షణ జీవితంలో అత్యవసరమన్నారు. అనంతరం సభా అధ్యక్షుడు జ్ఞాన కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ హారతి ద్వారకానాథ్ మాట్లాడుతూ.. వ్యక్తి సాధన లేకుండా సేవ చేయడం కష్టమని, పరోక్ష దూషణ మహాపాపమని, మనిషి మనిషికి మధ్య నమ్మకం ఉండాలన్నారు. అనంతరం బందెప్పగౌడ్ రచించిన శ్రీ సాయీశ్వర శతకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగదీశ్వర్ సింగ్ ఠాకూర్, పున్నయ్య, పద్మాకర్‌రావు, రామన్న, శ్రీనివాసులు, డాక్టర్ సత్యనారాయణ, కపిల్‌దేవ్, గోపాల్‌రెడ్డి, మనోహర్‌రావు, కులకర్ణి, బసవేశ్వర్, వేణు, విటోభా, సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: ఉధృతంగా ప్రవహిస్తున్న జుంటివాగు



పెద్దేముల్: గాజీపూర్ వాగు వద్ద కాపలా ఉన్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు



ధారూరు: ప్రవహిస్తున్న కాగ్నానదిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఐలు



తాండూరు: కాగ్నానది వద్ద పోలీసుల పహారా



మోమిన్‌పేటలో పెద్దవాగు కల్వర్టుపై నుంచి పారుతున్న వరద

# జోరువాన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.. పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. పంటలు నీట మునిగి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



కుల్కచర్ల: ఘనపూర్‌లో అలుగుపారుతున్న కొత్తకుంట చెరువు



ధారూరు: నీట మునిగిన ధారూరు ఆర్టీసీ బస్టాండ్



పెద్దేముల్: హన్మాపూర్‌లో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న లోంక నర్సింలు



పెద్దేముల్: పొలాల నుంచి పొంగిపొర్లుతున్న గాజీపూర్ వాగు



ధారూరు: రుద్రారం-నాగసముందర్ గ్రామాల మధ్య వంతెనపై నుంచి..



పూడూరు: నిండుగా పారుతున్న కంకల్ ఈసీ వాగు



పూడూరు: పారుతున్న మంచన్‌పల్లి వాగు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో టమాటా పొలంలో నిలిచిన వర్షం నీరు



దోమ: బ్రాహ్మణపల్లి వాగు వద్ద డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎంపీఓ సోమలింగం



మర్పల్లి: సిరిపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బీరప్ప వాగు



బంట్వారం: ఉధృతంగా పారుతున్న మలశెట్టిపల్లి వాగు



బొంరాస్‌పేట: అలుగుపారుతున్న దొరచెరువు



తాండూరు రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న నారాయణపూర్ వాగు



అల్లాపూర్ వద్ద వాగులో పడిన లారీ



నీట మునిగిన పెట్రోల్ బంక్



పరిగి: చెరువును తలపిస్తున్న సాయినగర్ కాలనీ



పరిగి: నస్కల్ వాగును సందర్శించిన ఎమ్మెల్యే

# పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న టీజీఈ జేఏసీ నాయకులు

కొడంగల్ రూరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం నిరసనలు వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసనలు వ్యక్తం చేస్తూ పలువురు నాయకులు మాట్లాడారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు లక్షల యాభై వేల ఉద్యోగులు ఐక్యత చాటుతూ సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. టీజీఈ జేఏసీ మండల బాధ్యులు క్రాంతికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత భరోసాగా నిలిచే పెన్షన్ లేకపోవడం తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీఈ జేఏసీ నాయకులు దినేష్‌కుమార్, అశోక్, వేణు, రమేశ్, కరుణాకర్, చంద్రకాంత్, వెంకట్రాములు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మాన్‌సింగ్



మాన్‌సింగ్‌ను ఎన్నుకున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: ధారూరు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మాన్‌సింగ్ ఆదివారం ఎన్నుకున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులంతా కలిసి దోర్నాల్‌తండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాన్‌సింగ్‌ను ప్రతిపాదించారు. అందరు ఆమోదించడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. పాత మండల పార్టీ రద్దయిందని, త్వరలో మండల స్థాయి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని రఘువీరారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పటోళ్ల రాములు, సీనియర్ నాయకులు గంతల నారాయణరెడ్డి, మహ్మద్ బాబాకాన్, బుజ్జయ్యగౌడ్, గఫార్, బల్వంత్‌రెడ్డి, గంధం హన్మయ్య తదితరులు పాల్గొన్నారు. మాన్‌సింగ్‌ను నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్‌గా విజయభాస్కర్‌రెడ్డి?

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కేరెల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి విజయభాస్కర్‌రెడ్డిని నియమించాలని మండల కాంగ్రెస్ నాయకులు ప్రతిపాదించారు. అందరు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేసి స్పీకర్‌కు నివేదించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాయకులంతా కలిసి వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశమై చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌గా లింగస్‌పల్లి అశోక్ ముదిరాజ్‌ను ఖరారు చేసి ప్రతిపాదించారు. అలాగే, డైరెక్టర్లుగా అమరేశ్వర్‌రావు, షమీం, ప్రతాప్, నర్సింహారెడ్డి, కె. రవీందర్, జె.శోభ, టి. రాము, బి.సాయన్న, ఎ.జైపాల్, వై.అంజయ్య, పి.వాణిశ్రీ వి. బాబ్యానాయక్ పేర్లను ప్రతిపాదించారు. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయని పార్టీ నాయకులు వెల్లడించారు. ప్రతిపాదిత జాబితాలోని పేర్లను స్పీకర్ ఖరారు చేసినట్లు తెలిసింది.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ శ్రీనివాస్

బంట్వారం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్నందున అత్యవసరమైతే తప్పా ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావద్దన్నారు. వాహనదారులు ఉధృతవంగా ప్రవహించే వాగులను దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. వ్యవసాయ పొలాల వద్ద రైతులు విద్యుత్ మోటార్లు, స్టార్టర్లను ముట్టుకోవద్దని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. రోడ్డు పక్కన ఉండే విద్యుత్‌స్తంభాలు, లైట్లను ,ట్రాన్స్‌ఫార్మర్లను తాకవద్దన్నారు. వర్షాల నేపథ్యంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

### పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా బుగ్గయ్య



నూతన కార్యవర్గం

పరిగి: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా దగ్గుల బుగ్గయ్య ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బుగ్గయ్య, ప్రధాన కార్యదర్శిగా వార్ల రాకేశ్, గౌరవ అధ్యక్షుడిగా ఉస్మాన్‌అలీ, అసోసియేషన్ అధ్యక్షుడిగా మనోహర్, వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, తస్లీం తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అమర్‌నాథ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పాలన సాగేదెట్లా?



బొంపల్లి పంచాయతీ కార్యాలయం



ఇళ్ల మధ్యలో చెత్తా,చెదారంతో పేరుకుపోయిన మురుగు నీరు

- బొంపల్లి జీపీలో అస్తవ్యస్తంగా మారిన పాలన
- కనిపించని ప్రత్యేకాధికారులు, లోపించిన పారిశుద్ధ్యం
- ఐదేళ్ల కాలంలో పది మంది కార్యదర్శులు బదిలీ

దోమ : అధికారుల నిర్లక్ష్యంతో గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా తయారవుతుంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు జీపీ పాలనను చూసుకుంటున్నారు. కాని, గతకొన్ని రోజులుగా జీపీలకు ప్రత్యేక అధికారులు రాకపోవడంతో పాలన దయనీయంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడం, నాలాల్లో మురుగు నీరు నిండి దుర్గంధం వెదజల్లుతుందని, దీంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

**విభేదాలతో విధులు నిర్వహించలేక బదిలీలు..**

మండలంలోని బొంపల్లి గ్రామ పంచాయతీలో మొత్తం 10 వార్డులు ఉండగా, అందులో రెండు వేల నాలుగు వందలకు పైగా జనాభా ఉన్నారు. అయితే, గత ఐదేళ్ల పాలనలో రెగ్యులర్, ఇన్‌చార్జి కార్యదర్శులతో కలిపి మొత్తం 10 మంది బదిలీపై వెళ్లారు. గతంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ మధ్య ఉన్న వర్గ విభేదాలతో పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వహించలేక పోయారు. దీంతో గ్రామం పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం గడ్డిమందు పిచికారీ చేయాలన్నా, దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించుకోవాలన్నా ఆలోచన సైతం అధికారులకు రావడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఇద్దరి మధ్య సఖ్యత లేకే..**



గతంలో పని చేసిన సర్పంచ్, ఎంపీటీసీ మధ్య ఉన్న వివాదాలలే గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉండకపోవడానికి కారణం. ఈ క్రమంలో గ్రామం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారి ఎవరో నేటికి మాకు తెలియదు. ఇప్పటివరకు గ్రామంలోని పరిసరాలను పరిశీలించింది లేదు. పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిని తీసుకెళ్లి అధికారులు ఖమ్మంనాచారానికి బదిలీ చేశారు. దీంతో గ్రామంలో కార్యదర్శి లేక పాలన కుంటుపడుతుంది.

–ప్రభాకర్, బొంపల్లి

**ఇన్‌చార్జిని నియమించాం**



గ్రామానికి పంచాయతీ కార్యదర్శులు రావడానికి భయపడుతున్నారు. ఈ క్రమంలో బాస్‌పల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శిని బొంపల్లి జీపీకి ఇన్‌చార్జిగా నియమించాం. నేటి నుంచి గ్రామంలో ఉన్న సమస్యలను తొలంగించేందుకు చర్యలు తీసుకుంటాం.

–సోమలింగం, ఎంపీఓ, దోమ